సాక్షి
ఒడిశా
బుధవారం । 23 । ఏప్రిల్ । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం మంగళవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,32,549లు, బంగారం 100 మిల్లీగ్రాములు, వెండి 1 గ్రాము 200 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



రాజధానిలో కిడ్నాప్ కలకలం

నగరంలో మంగళవారం ఉదయం సంచలనాత్మక ఘటన చోటుచేసుకుంది. తుపాకీతో బెదిరించి మైనరు బాలుడిని దుండుగులు అపహరించుకుపోయారు.

- 8లో



విశ్రాంత ఉద్యోగుల ధర్నా

ఒడిషా రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు మంగళవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు శాంతియుత ధర్నా చేపట్టారు.

- 8లో

న్యూస్‌రీల్

ఉచిత కంటివైద్య పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

మల్కన్‌గిరి: జిల్లాలోని మత్తిలి సమితి ఉదిలిబేడ పంచాయతీలో ఉచిత కంటివైద్య పరీక్షలు సోమవారం నిర్వహించారు. భువనేశ్వర్ నుంచి వచ్చిన కంటి వైద్యురాలు లిజరాణి పండా 42 మందికి పరీక్షలు చేసి అవసరమైనవారికి మందులు పంపిణీ చేశారు. అలాగే ఉచితంగా కంటి వైద్య పరీక్షలకు పలువురిని సిఫార్సు చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గాంగీ శ్రీగమ్, పంచాయతీ కార్యనిర్వాహక అధికారి అశోక్ మహారాణా తదితరులు పాల్గొన్నారు.

అక్రమ బెల్టుషాపుపై ఫిర్యాదు



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

పర్లాకిమిడి: గజపతి జిల్లా గుసాని బ్లాక్‌లోని సవర గుసాని గ్రామం నడిబొడ్డున అక్రమ సారా బెల్టుషాపు పెట్టడంతో గ్రామస్తులు భయకంపితులవుతున్నారు. మహిళలపై అఘాయిత్యాలు, కామెంట్లు పెరుగుతున్నాయిని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రదీప్‌కుమార్ సాహుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. దీంతో వెంటనే బెల్టు షాపుపై చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

సమస్యలు పరిష్కరించండి



అధికారులకు సమస్యలు వివరిస్తున్న గ్రామస్తులు

రాయగడ: బిసంకటక్ సమితిలోని నియమగిరి పర్వత ప్రాంతాల్లో నివసిస్తున్న డొంగిరియా తెగ ఆదివాసీల సమస్యలు సమస్యలుగానే మిగిలిపోతున్నాయని, ఇచ్చిన హామీలు గాలికొదిలేశారని నియమగిరి సురక్షా సమితి అధ్యక్షుడు లొద్ద సికక అధికారులను ప్రశ్నించారు. ఈ మేరకు వందలాది మంది గ్రామస్తులతో బిసంకటక్ బీడీవో కార్యాలయం వద్ద మంగళవారం నిరసన తెలిపారు. అయితే ఆ సమయంలో బీడీవో లేకపోవడంతో సమితి ఇంజినీర్ సబ్యసాచి నాయక్‌ను కలిసి సమస్యలను వివరించారు. నియమగిరి పర్వత ప్రాంతంలోని లాఖ్‌పదర్, పాట్టంగిపాదొరొ గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు కల్పిస్తామని గతేడాది అధికారులు హామీలు ఇచ్చారన్నారు. ముఖ్యంగా ఆయా గ్రామాలకు రహదారి, తాగునీటి సౌకర్యం, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా నిరుపేదలకు ఇళ్ల నిర్మాణం, విద్యుత్ సౌకర్యాలను కల్పించాలని కోరారు.

వలస కార్మికురాలి మృతి



ఆదాయి వడక (ఫైల్)

రాయగడ: ఉపాధి కోసం పొరుగు రాష్ట్రం వెళ్లిన ఒక డొంగిరియా తెగకు చెందిన యువతి మృతి చెందింది. మృతురాలు జిల్లాలోని బిసంకటక్ సమితి కుర్లి పంచాయతీలోని ఖజురి గ్రామానికి చెందిన ఆదాయి వడక(17)గా గుర్తించారు. ఆమె గత కొద్ది నెలల క్రితం కేరళలోని త్రిసురి జిల్లా అటాని వద్ద ఒక టైల్స్ కంపెనీలో కూలికి చేరింది. దీంతో ఆదాయంలో కొంతమొత్తం ఇంటికి పంపించేది. అయితే ఇటీవల ఆమె ఆరోగ్యం క్షీణించడంతో సోమవారం మృతి చెందినట్లు కంపెనీ యాజమాన్యం కుటుంబీకులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని తీసుకొచ్చేందుకు జిల్లా యంత్రాంగం సహకారాన్ని అందిస్తున్నట్లు ప్రకటించింది.

పాముకాటుతో బాలుడి మృతి



దీపక్ మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లిదండ్రులు

రాయగడ: జిల్లాలోని జిమిడిపేట పంచాయతీ టురి హంస గ్రామంలో పాముకాటుతో బాలుడు మృతి చెందాడు. మృతుడు సింహాద్రి మినియాక కుమారుడు దీపక్ మినియాక (7)గా గుర్తించారు. సోమవారం రాత్రి ఏడు గంటల సమయంలో ఇంటి బయట దీపక్ ఆడుతుండగా పాము కాటు వేసింది. విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేయగా బాలుడికి నాటు వైద్యం చేయించారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం జిమిడిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

హటొపాదొరొలో ఘోరం

- చేతబడి నెపంతో వ్యక్తి దారుణ హత్య
- దర్యాప్తు చేసేందుకు వెళ్లిన పోలీసులపైనా దాడి



దాడిలో మృతి చెందిన భైరవ సాహు



హటొపాదొరొ వీధిలో పోలీసుల గస్తీ



గాయాలపాలైన ఐఐసీ ప్రధాన్

రాయగడ: చేతబడి చేస్తున్నాడన్న నెపంతో ఓ వ్యక్తిని దారుణంగా హత్య చేసిన ఘటన పద్మపూర్‌లోని హటొపాదొరొ వీధిలో సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఈ దారుణలో ఘటనలో భైరవ సాహు (54) అనే వ్యక్తి మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్న సమయంలో కొందరు గ్రామస్తులు పోలీసులపైనా దాడికి పాల్పడ్డారు. వివరాల్లోకి వెళితే.. పద్మపూర్‌లోని హటొపాదొరొ వీధిలో భైరవ సాహు అనే వ్యక్తి కుటుంబంతో కలిసి నివాసముంటున్నాడు. అదే వీధిలో పది నెలలుగా అనారోగ్యంతో ఓ వ్యక్తి మంచాన పడ్డాడు. దీనికి సాహు చేతబడి చేయడమే కారణమని అనుమానిస్తుండేవారు. ఈ నేపథ్యంలో రెండు రోజుల కిందట సదరు వ్యకి మృతి చెందాడు. చేతబడి కారణంగానే మృతి చెందాడని ఆరోపిస్తూ సోమవారం రాత్రి కొందరు వ్యక్తులు భైరవ సాహు ఇంటికి వెళ్లారు. సాహును బయటకు పిలిచి కర్రలు, మారణాయుధాలతో దాడి చేశారు. సమాచారం తెలుసుకున్న పద్మపూర్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని అపస్మారక స్థితిలో ఉన్న సాహుని ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేయగా కొందరు పోలీసులపైనా దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ఐఐసీ ధరణీ ధర్ ప్రధాన్ తలకు గాయమయ్యింది. అనంతరం సాహును ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ఇదిలా ఉండగా పోలీసులపై దాడి చేయడంతో హటొపాదొరొల్లోని 30 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌డీపీఓ బబులి నాయక్ ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.



ఘటనా స్థలం వద్ద గాయాలతో ఐఐసీ ప్రధాన్



హటొపాదొరొలో పోలీసులపై దాడి చేస్తున్న స్థానికులు

ఘోర రోడ్డు ప్రమాదం



ఘటనా స్థలంలో గుమిగూడిన ప్రజలు

- ఇసుక ట్రక్, పోలీసు వాహనం ఢీ
- ప్రమాదంలో ఇద్దరు పోలీసులు మృతి

కొరాపుట్: కటక్‌లో భారీ రోడ్డు ప్రమాదం జరిగింది. మంగళవారం వేకువజామున కటక్–పారాదీప్ రోడ్డులో భారీ ఇసుక లోడుతో వెళ్తున్న ట్రక్ ఎదురుగా వస్తున్న పోలీసు పెట్రోలింగ్ వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో పోలీసు వాహనంలో ఉన్నటువంటి కానిస్టేబుల్ లోక్‌నాథ్ సబరో(35), హోం గార్డు జగబంధు మాలి(30) అక్కడికక్కడే మృతి చెందారు. మరో హోం గార్డు తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలిసిన వెంటనే పోలీసువర్గాలు వెంటనే స్పందించారు. గాయపడిన హోం గార్డును కటక్‌లోని ఎస్‌సీబీ వైద్య కళాశాలకి తరలించారు.

సీఎం సంతాపం

ఈ ఘటనపై రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ సంతాపం ప్రకటించారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున్న పరిహారం ప్రకటించారు. ప్రభుత్వపరంగా మిగతా సహాయాలు అందుతాయన్నారు. వారి కుటుంబాలను అన్నివిధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ ఘటనలో ఇసుక మాఫియా పాత్రపై కూడా దృష్టి పెడతామని పోలీసు కమిషనర్ దేవదత్త సింగ్ ప్రకటించారు. ప్రమాదానికి కారణమైన ట్రక్ డ్రైవర్‌ని అదుపులోకి తీసుకున్నామన్నారు. ఇది ప్రమాదమా లేకపోతే ఇసుక మాఫియా నేరమా అన్నది దర్యాప్తులో తేలుతుందన్నారు.

అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

పోలీసుల మృతదేహాలకు కటక్ ఎస్‌సీబీలో పోస్టుమార్టం జరిగింది. సాయుధ పోలీసు లాంఛనాలతో గౌరవ వందనం చేశారు. కటక్, భువనేశ్వర్ జంట నగరాల నుంచి పెద్ద ఎత్తున పోలీసులు వచ్చి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. మరోవైపు ఇప్పటివరకు విధి నిర్వహణలో 800 మంది పోలీసులు మృతి చెందినా, వారి కుటుంబాలకు ఉద్యోగాలు ఇవ్వలేదని దివంగత పోలీసు కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేశాయి. కాగా ప్రస్తుత ప్రమాదం చూస్తే అక్రమ ఇసుక రవాణాని అడ్డుకున్నందుకే ట్రక్‌తో గుద్ది పోలీసులను హత్య చేసినట్లు కనిపిస్తోందని అనుమానం వ్యక్తం చేశారు.



ప్రమాద స్థలంలో వాహనాలు



సహాయక చర్యల్లో పోలీసులు



మృతదేహాలకు పోలీసుల గౌరవ వందనం

ఉత్సాహంగా సైకిల్ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

కొరాపుట్: ప్రపంచ ప్రకృతి దినోత్సవం సందర్భంగా మంగళవారం జయపూర్ పట్టణంలో సోషల్ ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ అసోషియేషన్ (సీవా) ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ చేపట్టారు. ప్రకృతిని ప్రేమించాలని, మొక్కలు నాటాలని, ప్లాస్టిక్‌కి దూరంగా ఉండాలని వక్తలు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీవా ప్రెసిడెంట్ సుధాకర్ పటాన్రయక్, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ కిల్లం శెట్టి మోహన్ రావు, ప్రతాప్ పట్నాయక్, జి.వి.రెడ్డి, సదాశివ పట్నయక్, 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

రాయగడలో ధరిత్రీ దినోత్సవం



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

రాయగడ: స్థానిక గౌతంనగర్‌లోని సెంచూరియన్ పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ ధరిత్రీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని భూమాత సంరక్షణ అందరి బాధ్యత అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం సస్మిత మహంతి, అధ్యాపకులు తపన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టెర్రరిస్టుల దాడిలో ఒడిశా యువకుడు మృతి





భద్రతా బలగాల సహాయ చర్యలు, ఇన్‌సెట్లో ప్రశాంత్ కుమార్ సత్పతి(ఫైల్)

కొరాపుట్: కాశ్మీర్‌లో టెర్రరిస్టుల దాడిలో ఒడిశా యువకుడు మృతి చెందాడు. మంగళవారం పెహల్గాంలో పర్యటకులపై టెర్రరిస్టులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో బాలేశ్వర్ జిల్లా రెమునా సమితికి చెందిన ప్రశాంత్ కుమార్ సత్పతి (30) చనిపోయాడు. ఈయన ఈ నెల 20న కుటుంబంతో కలిసి కాశ్మీర్ పర్యటనకు వెళ్లారు. మధ్యాహ్నం భార్యతో కలిసి విహరిస్తున్నప్పుడు తుపాకీ తూటా తగిలి పడిపోయాడు. గంటన్నర తర్వాత ఆర్మీ అక్కడికి చేరుకొని ఆస్పత్రికి తరలించేటప్పటికే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మజ్జి, మాజీ సీఎం నవీన్ పటాన్రయక్, సీఎల్‌పీ నాయకుడు రామ ఖడం సంతాపం ప్రకటించారు.

గంజాయితో ఇద్దరు అరెస్టు



గంజాయితో పట్టుబడిన నిందితులు

రాయగడ: గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎక్సైజ్ అధికారులు అరెస్టు చేశారు. అరెస్టైనవారిలో రాజస్థాన్‌కు చెందిన దుర్గేష్ కుమార్ మీన, నవీన్ కుమార్ మీనాలు ఉన్నట్లు గుర్తించారు.

వారి నుంచి 43.300 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులను సోమవారం కోర్టుకు తరలించారు. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ దాస్, ఓఐసీ సంజయ్ కుమార్ ప్రధాన్ సిబ్బంది కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో అనుమానాస్పదంగా ఇద్దరు వ్యక్తుల కనిపించారు. వారి బ్యాగులను తనిఖీ చేయగా అందులో గంజాయి పట్టుబడింది. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.4.30 లక్షలు ఉంటుందని అధికారులు తెలియజేశారు.

మొక్కజొన్న పంట దగ్ధం



కాలిపోయిన మొక్కజొన్న పంట

కొరాపుట్: చేతికొచ్చిన మొక్కజొన్న పంటని గుర్తు తెలియని దుండగులు తగలబెట్టారు. మంగళవారం నబరంగ్‌పూర్ జిల్లా రాయిఘర్ సమితి సర్గులిలో జోత్యిర్మయ్ సునాకి చెందిన 5 ఎకరాల పంట అగ్నికి ఆహుతైంది. బాధిత రైతు జ్యోతిర్మయ్ అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరిన సమయంలో పంట కాలిపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక బృందం సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.



కాలిపోయిన పంటను చూపిస్తున్న గ్రామస్తులు

స్థానిక నేతలు గుర్తుకు రాలేదా?

కొరాపుట్: రాష్ట్ర ప్రభుత్వానికి అవిభక్త కొరాపుట్ జిల్లాల ప్రజా ప్రతినిధుల గుర్తుకు రాలేదా అని బీజేడి పార్టీకి చెందిన రాజ్యసభ ఎంపీ, ఒడియా సినీ హీరో మున్నా ఖాన్ ప్రశ్నించారు. మంగళవారం నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని సర్క్యూట్ హౌస్‌లో విలేకరులతో మాట్లాడారు. సోమవారం దివంగత ముఖ్యమంత్రి సదాశివ త్రిపాఠి జయంతి రాష్ట్ర రాజధాని భుబనేశ్వర్‌లో జరిగిందని, సదాశివ నబరంగ్‌పూర్ జిల్లాకి చెందిన వ్యక్తి అని, అలాంటిది అవిభక్త కొరాపుట్ జిల్లాల ప్రజాప్రతినిధులను ఆహ్వానించకపోవడం తగదన్నారు. నవీన్ పట్నాయక్ 9వ సారి బీజేడి పార్టీ అధ్యక్షునిగా జరిగిన కార్యక్రమంలో తాను అతని చేతికి గులాబి పువ్వు ఇచ్చానని, కానీ కొందరు మీడియాలో నవీన్‌కి కమలం ఇచ్చానని, దానిని తీసుకోవడానికి నవీన్ తిరస్కరించినట్లు చూపించారన్నారు. అటువంటి వారు కళ్లద్దాలు మార్చుకోవాలని మున్నాఖాన్ హితవుపలికారు. సమావేశంలో పార్టీ నాయకులు బద్రి నారాయణ సింగ్, ప్రమోద్ రథో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్నాఖాన్. పక్కనే బద్రినారాయణ, ప్రమోద్ రథ్

ఆహారపు అలవాట్లు మార్చుకోవాలి



వంటల ప్రదర్శనలో పాల్గొన్న మహిళలు



తృణ ధాన్యాలతో తయారు చేసిన వంటకాలు

రాయగడ: ప్రస్తుత సమాజం ఆహారపు అలవాట్లను మార్చుకొని, రాగులు, జొన్నలు వంటి తృణధాన్యాలు వినియోగించాలని జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతీ మాఝి సూచించారు. స్థానిక డీఆర్‌డీఏ సమావేశం మందిరంలో పోషణ పక్షోత్సవాల ముగింపు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం యువత ఫాస్ట్‌ఫుడ్ వంటి ఆహారపు అలవాట్లతో ఆరోగ్యాన్ని పాడుచేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా సాంఘిక, సంక్షేమ శాఖ అధికారి మీనతీ దేవ్ మాట్లాడుతూ.. జిల్లాలోని ఎంతోమంది మహిళలు రాగుల, జొన్నలు వంటి తృణధాన్యాలతో తయారు చేసిన వంటకాలను విక్రయించి ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారన్నారు. అదేవిధంగా తృణధాన్యాల వల్ల కలిగే లాభాలపై గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ముఖ్యంగా రాగులతో తయారయ్యే జావ వంటివి నిత్య ఆహారంలో భాగంగా మార్చుకోవాలని సూచించారు. అనంతరం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన స్వయం సహాయక బృందాలకు చెందిన మహిళలు రాగులు, జొన్నలతో తయారు చేసిన పిండి వంటలను ప్రదర్శించారు. ఉత్తమ వంటకాలకు ఈ సందర్భంగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి ప్రమీల దాస్, జిల్లా ముఖ్య వ్యవసాయ శాఖ అధికారి బిష్ణు ప్రసాద్ ఖర్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి దయానిధి రౌత్ తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కార్యకర్తలు

క్లుప్తంగా

రోడ్డుకు అడ్డంగా గ్రానైట్ లారీ



చింతలపోలూరు వద్ద నిలిచిన గ్రానైట్ లారీ

మెళియాపుట్టి: మండలంలోని చింతలపోలూరు వద్ద గ్రానైట్ రాయితో వెళుతున్న లారీ సాంకేతిక కారణంగా రహదారికి అడ్డంగా నిలిచిపోయింది. సాయంత్రం సమయం కావడం, అధిక సంఖ్యలో రాకపోకలు కొనసాగించే రహదారి కావడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. దీనబంధుపురం గ్రామ పంచాయతీలో సుమారు 20కి పైగా గ్రానైట్ క్వారీలు ఉండటంతో రాకపోకలు సాగించే వాహనాల శబ్దాలతో పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

గంజాయి కేసులో నాలుగేళ్ల జైలు శిక్ష

మెళియాపుట్టి : మెళియాపుట్టి కూడలిలో 2023 ఏప్రిల్ 25న గంజాయితో పట్టుబడిన బులుమాలి అనే వ్యక్తికి నాలుగేళ్ల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ మంగళవారం కోర్టు తీర్పు వెలువరించింది. నిందితుడిది ఒడిశా రాష్ట్రం చడియాపడ గ్రామమని పోలీసులు తెలిపారు.

న్యాయమూర్తులకు బదిలీలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో పలువురు న్యాయమూర్తులకు బదిలీ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. శ్రీకాకుళం ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి భరణికి నర్సీపట్నం ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ కోర్టుకు బదిలీ అయ్యింది. ఆమదాలవలస జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఎస్.మణికి కాకినాడ, నరసన్నపేట కోర్టు న్యాయమూర్తికి పాలకొండకు బదిలీ అయ్యింది. పాలకొండ కోర్టు న్యాయమూర్తి విజయ్‌రాజ్‌కి విజయనగరం జూనియర్ డివిజన్ సివిల్ కోర్టుకు, సోంపేట కోర్టు న్యాయమూర్తి ఎ.రాముకు విశాఖపట్నం బదిలీ చేశారు. టెక్కలి కోర్టు న్యాయమూర్తి హెచ్‌ఆర్ తేజా చక్రవర్తికి విజయనగరం బదిలీ అయ్యారు. పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం నుంచి కె.శ్రీనివాస్ సోంపేట కోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. విజయనగరం జిల్లా శృంగవరపు కోట నుంచి ఎస్.వాణి నరసన్నపేట కోర్టు న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు.

27న జిల్లా బీచ్ కబడ్డీ జట్లు ఎంపిక

శ్రీకాకుళం అర్బన్: జిల్లా సీనియర్స్ పురుషులు, మహిళల బీచ్ కబడ్డీ జట్ల ఎంపికలు ఈ నెల 27న నిర్వహిస్తున్నట్టు జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్షుడు నక్క కృష్ణారావు, కార్యదర్శి సాదు ముసలినాయుడు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌కాలనీ స్విమ్మింగ్ పూల్, ఇండోర్ స్టేడియం వద్ద నాగావళి రివర్ నదీతీరాన ఆదివారం ఉదయం 9 గంటల నుంచి ఈ ఎంపికలు జరుగుతాయని చెప్పారు. పురుషులు 85 కేజీలు, మహిళలు 75 కేజీల లోపు బరువు ఉండాలని స్పష్టం చేశారు. ఇక్కడ ఎంపికైన జట్లు మే 2 నుంచి 4వ తేదీ వరకు కాకినాడలో జరగనున్న ఏపీ రాష్ట్ర స్థాయి బీచ్ కబడ్డీ చాంపియన్ షిప్ పోటీలలో శ్రీకాకుళం జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు సంఘ కార్యనిర్వాహక కార్యదర్శి, పీడీ సాధు శ్రీనివాసరావు (సెల్: 9441914214)ను సంప్రదించాలని వారు కోరారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన లగేజీ వాహనం

రణస్థలం: మండల కేంద్రం రణస్థలంలోని జాతీయ రహదారిపై పాత పెట్రోల్ బంకు కూడలి వద్ద ద్విచక్ర వాహనాన్ని మంగళవారం ఉదయం 10.30 టాటా లగేజీ వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో ద్విచక్రవాహనంపై ఉన్న ముగ్గురికి గాయాలయ్యాయి. ఇందులో బి.సీతారాం అనే వ్యక్తికి రెండు కాళ్లు విరిగిపోయి పరిస్థితి విషమంగా ఉండటంతో 108 అంబులెన్సులో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. పల్ల శివాజీ, రేగాన వెంకటేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. జె.ఆర్.పురం ఏఎస్సై డి.రమణమూర్తి ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. క్షతగాత్రులు లావేరు మండలం పైడియ్యవలసకు చెందినవారు. జె.ఆర్.పురం ఎస్సై ఎస్.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

ఎస్పీలతో డీఐజీ సమీక్ష

శ్రీకాకుళం క్రైమ్ : విశాఖ రేంజి పరిధిలోని ఎస్పీలు, ఇతర అధికారులతో డీఐజీ గోపినాథ్ జెట్టి మంగళవారం సమీక్ష నిర్వహించారు. గంజాయి అక్రమ రవాణా, వినియోగ నియంత్రణ, నిందితుల అరెస్టు, వారి ఆస్తుల జప్తు తదితర అంశాలపై చర్చించాచారు. చెక్‌పోస్టుల వద్ద నిఘా, విస్తృత తనిఖీలు నిర్వహించాలని, తప్పించుకుని తిరుగుతున్న నిందితులను అరెస్టు చేసి వారిపై ఉన్న నాన్‌బెయిల్‌బుల్ వారెంట్లు తక్షణమే జారీ చేయాలన్నారు. సమావేశంలో ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజధానిలో కిడ్నాప్ కలకలం

- తుపాకీతో బెదిరించి బాలుడిని అపహరించిన దుండగులు
- రంగంలోకి దిగిన పోలీసులు
- బాలుడ్ని వదిలి పరారైన కిడ్నాపర్లు



అపహరణకు గురైన బాలుడి ఇంటి ముందు గుమిగూడిన జనం

భువనేశ్వర్: నగరంలో మంగళవారం ఉదయం సంచలనాత్మక ఘటన చోటుచేసుకుంది. తుపాకీతో బెదిరించి మైనరు బాలుడిని దుండుగులు అపహరించుకు పోయారు. ఈ ఘటనలో స్థానికులు తీవ్రంగా కలవరపడ్డారు.

స్థానిక ఎయిర్ ఫీల్డ్ పోలీస్ ఠాణా పరిధిలోని పంచగావ్ సమీపంలో తుపాకీతో బెదిరించి పిల్లవాడిని కిడ్నాప్ చేశారు. కిడ్నాపర్లు తలపై తుపాకీతో బెదిరించి బాలుడిని బలవంతంగా నల్లటి కారులోకి ఎత్తుకుపోయినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. కొద్దిసేపటి తర్వాత కిడ్నాపర్లు ఆ చిన్నారి కుటుంబానికి ఫోన్ చేసి రూ. 20 లక్షలు డిమాండ్ చేశారు. డబ్బులు చెల్లిస్తే బాలుడిని సురక్షితంగా అప్పగిస్తామని చెప్పారు. ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా రంగంలోకి దిగిన పోలీసులు 3 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి విస్తృత గాలింపు చర్యలు చేపట్టారు. సాంకేతిక నిఘా, స్థానిక నిఘా, వాహన ట్రాకింగ్ వ్యవస్థలను ప్రయోగించి చిన్నారిని సురక్షితంగా గుర్తించారు. పోలీసుల రాక గుర్తించి కిడ్నాపర్లు అక్కడి నుంచి పారిపోయారు. వారిని పట్టుకోవడానికి ముమ్మరంగా గాలింపు చర్యలు నిర్వహిస్తున్నారు.

అమ్మా వస్తున్నానంటూనే.. అనంతలోకాలకు..

- అనుమానాస్పదంగా విద్యార్థి మృతి
- లొద్దపుట్టి ఆర్‌హెచ్ కాలనీలో విషాదం



గోపాల్ (ఫైల్)

రైలు పట్టాలపై యువకుడి మృతదేహం

ఇచ్ఛాపురం రూరల్: 'అమ్మా...ఈ రోజు ఇంటికి వస్తున్నాను...' అని కన్న కొడుకు తల్లికి ఫోన్‌లో సమాచారం అందించాడు. దీంతో ఆ తల్లి కొడుకుకు ఇష్టమైన వంటకాలు చేసి వేయి కళ్లతో ఎదురు చూడటం ప్రారంభించింది. ఉదయం ఫోన్ చేసిన కొడుకు రాత్రి పన్నెండు గంటలైనా ఇంటికి చేరక పోవడంతో ఫోన్‌చేసింది. స్విచ్ఛాఫ్ రావడంతో ఆందోళనకు గురైంది. తెల్లారితే... కొడుకు చదువుతున్న కళాశాలకు ఫోన్ చేస్తే మృతి చెందాడన్న పిడుగులాంటి వార్తను చేరవేయడంతో ఆ తల్లి గుండె పగిలేలా విలపించింది. వివరాల్లోకి వెళితే.. ఇచ్ఛాపురం మండలం లొద్దపుట్టి గ్రామం ఆర్‌హెచ్ కాలనీకి చెందిన నెయ్యిల నీలాద్రి(లడ్డూ), ఢిల్లేశ్వరీల కుమారుడు గోపాల్(19). విశాఖపట్నం జిల్లా తగరపువలసలోని అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో డిప్లమో సెకెండియర్ చదువుతున్నాడు. తండ్రి నీలాద్రి గల్ఫ్‌లో కూలి పనులు చేస్తున్నాడు. సోమవారం తల్లికి ఫోన్ చేసి 'అమ్మా....ఈ రోజు ఇంటికి వస్తున్నాను' అంటూ చెప్పిన గోపాల్ అర్ధరాత్రి వరకు ఇంటికి చేరక పోవడంతో మంగళవారం ప్రిన్సిపాల్‌కు ఫోన్ చేసింది. గోపాల్ విజయనగరంలోని రైలు కింద పడి మృతి చెందినట్లు చెప్పడంతో తల్లి కుప్పకూలిపోయింది. కుమారుడు రైలు పట్టాలపై పడి ఆత్మహత్య చేసేకునేంత పిరికి వాడు కాదని, కుమారుడు మృతి వెనుక కుట్రదాగి ఉందని తల్లి ఆవేదన వ్యక్తం చేస్తోంది. విద్యార్థి గోపాల్ మృతితో గ్రామంలో విషాధ చాయలు అలముకున్నాయి.

భర్తే హంతకుడు

జి.సిగడాం: మండలంలోని సంతవురిటి గ్రామానికి చెందిన బాలబొమ్మ భవానీ(21) అనే వివాహిత ఈ నెల 15న అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ కేసులో భర్తే హంతకుడని జె.ఆర్.పురం సీఐ అవతారం మంగళవారం జి.సిగడాం పోలీస్‌స్టేషన్‌లో విలేకరులకు వెల్లడించారు. సంతవురిటి గ్రామానికి చెందిన బాలబొమ్మ వెంకటదినేష్ కృష్ణ, పాలఖండ్యాం గ్రామానికి చెందిన ధారభోయిన భవానీకి తొమ్మిది నెలల కిందట వివాహం జరిగింది. కొన్నాళ్లుగా ఇద్దరికీ గొడవలు జరుగుతున్నాయి. ఈ నెల 15న వేకువజామున భవానీ మృతి చెందడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణలో భాగంగా భర్త వెంకటదినేష్ కృష్ణ గొంతునొక్కి హత్య చేసినట్లు నిర్ధారించారు. ముద్దాయిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో ఎస్ఐ వై.మధుసూదనరావు పాల్గొన్నారు.

ఐదు కిలోల గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రామారావు

పాతపట్నం: అక్రమంగా గంజాయి తరలిస్తున్న గార మండలం పొగాకువానిపేట గ్రామానికి చెందిన దువ్వు సాయి సురేష్ రెడ్డి అలియాస్ సాయి అనే యువకుడిని మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. పాతపట్నం పోలీస్ సర్కిల్ కార్యాలయంలో సీఐ వి.రామారావు విలేకరులకు వివరాలు వెల్లడించారు. గార మండలం పొగాకువానిపేటకు చెందిన దువ్వు సాయి సురేష్ రెడ్డి అలియాస్ సాయి ఐటీఐ చదువుతూ మధ్యలో మానేసి వెల్డింగ్ పనులు చేస్తుండేవాడు. ఈ క్రమంలో మంగళవారం నెల్లూరు జిల్లాకు తరలించేందుకు 5.662 కిలోల గంజాయిని 3 ప్యాకెట్లుగా తయారు చేసి బ్యాగ్‌తో ఒడిశా నుంచి నడిచి వస్తుండగా పాతపట్నం చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. నెల్లూరు జిల్లా సూళ్లూరుపేటకు చెందిన వ్యక్తికి అప్పగించేందుకు గంజాయిని తీసుకొస్తున్నట్లు గుర్తించారు. గంజాయిని స్వాధీనం చేసుకుని సాయిని అరెస్టు చేశారు. సమావేశంలో ఎస్ఐ బి.లావణ్య, ఏఎస్ఐ సింహాచలం, పోలీసులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: నగరంలోని కలెక్టరేట్ వద్ద ఉన్న పూలే పార్కు వద్ద శనివారం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు జీతాలు సకాలంలో చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మిడ్ లెవెల్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.ఉషారాణి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఇందుమతి, జిల్లా కో-ఆర్డినేటర్ సీహెచ్ రాజీవ్, జి.రాఘవ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లపై కుట్ర



మాట్లాడుతున్న ఎస్.వి.రమణమూర్తి

శ్రీకాకుళం: ఓవైపు పాత పెన్షన్ అమలు కోసం ఉద్యోగులు కలిసికట్టుగా పోరాటం చేస్తుంటే ఇవేవీ పట్టని కేంద్ర ప్రభుత్వం పాత ఫించన్‌దారులకు హానికలిగించేలా పెన్షన్ సవరణ బిల్లు తీసుకురావడం దారుణమని ఎన్జీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ రమణమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ దాసరి క్రాంతి భవన్ వద్ద లోక్‌సభలో పెన్షన్ సవరణ బిల్లు ఆమోదంపై చర్చా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్జీయూ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.రామకష్ణ, చింతల రామారావు, శ్రీనివాసరావు, తిరుమలరావు, జి.శ్రీనివాసరావు, హెచ్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సాంఘిక సంక్షేమ శాఖ డీడీపై దర్యాప్తు



విచారణకు హాజరైన దళిత యువకులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: సాంఘిక సంక్షేమ శాఖ డీడీ విశ్వమోహన రెడ్డిపై వచ్చిన ఫిర్యాదుల మేరకు మంగళవారం కలెక్టరేట్‌లోని కేఆర్‌సీసీ కార్యాలయంలో ఎస్‌డీసీ బి.పద్మావతి విచారణ చేపట్టారు. తనకు సాంఘిక సంక్షేమ శాఖలోని వసతి గృహాల్లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం ఇస్తానని డీడీ విశ్వమోహన్ రెడ్డి రూ.2,50,000 లంచం అడగ్గా దఫదఫాలుగా రూ.2,30,000 ఇచ్చినట్టు కొత్తూరు మండలానికి చెందిన దళిత యువకుడు ఎస్.ప్రసాద్ ఫిర్యాదు చేశాడు. అదనంగా రూ.20 వేలు ఇవ్వనందున డీడీ తనకు ఉద్యోగం ఇవ్వలేదని పేర్కొన్నాడు. ఇటీవల ఇదే శాఖలో ఎనిమిది మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగ నియామకాలను డీడీ చేపట్టారని, అందులో తన పేరు లేకపోవడంపై ప్రశ్నించగా తనతో పాటు గజేంద్ర, పవన్ అనే యువకులపైనా కులదూషణ చేసినట్లు తెలిపాడు. తమ డబ్బులు ఇచ్చేయాలని ప్రసాద్ తల్లి దమయంతి నిలదీయగా, ఆమెను కూడా దూషించినట్లు చెప్పాడు. కాగా, బాధితులు మాత్రం విచారణ సంతృప్తికరంగా లేదని, ఏకపక్షంగా చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

పుస్తకం తిరగేద్దాం.. చరిత్ర తిరగరాద్దాం!

- జ్ఞాపిక శక్తి, భాషా పరిరక్షణకు పుస్తకాలే కీలకం
- పుస్తక పఠనం పెరగాలంటున్న విద్యావేత్తలు
- నేడు ప్రపంచ పుస్తక దినోత్సవం



ఇంటి లైబ్రరీలో చదువుతున్న ఓ వ్యక్తి



ఒక అభిమాని ఇంటి షెల్ఫ్‌లో ఉన్న పుస్తకాలు

శ్రీకాకుళం కల్చరల్: నేటి సాంకేతిక యుగంలో పుస్తక పఠనం బాగా తగ్గిపోయింది. ముఖ్యంగా యువత స్మార్ట్‌ఫోన్లకు అతుక్కుపోవడంతో పుస్తకాలు చదివే వారు బాగా తగ్గిపోయింది. మనలో ఒంటరితనాన్ని పోగొట్టి మరో ప్రపంచంలోకి విహరింపజేసే పుస్తకాలే మనకు నిజమైన నేస్తాలని విద్యావేత్తలు చెబుతున్నారు. రోజులో కొంత సమయమైనా పుస్తక పఠనానికి కేటాయించాలని కోరుతున్నారు. నేటి తరంవారికి పుస్తకాలు చదవడం అంటే కేవలం పాఠ్య పుస్తకాలు చదవడం అనే అభిప్రాయం ఉంది. అందుకే సాధారణ పుస్తకాల చదవడం మానేశారు. ఇంకొందరు మాత్రం పుస్తకాలపై ప్రేమ చూపుతునే ఉన్నారు. తాము కొనుగోలు చేసిన, సేకరించిన పుస్తకాలతో ఇంట్లోనే లైబ్రరీని ఏర్పాటు చేసుకుంటున్నారు. రోజులో సగభాగం అందులోనే గుడుపుతుంటారు. అలాంటి వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు.

ఏకైక నేస్తం..



మన వ్యక్తిత్వానికి, వికాసానికి అద్దం పట్టేది పుస్తకం. పుస్తక పఠనం ద్వారా ఎంతో విజ్ఞానాన్ని పొందవచ్చు. అత్యంత ఉత్తమ సమాచార, ప్రచార, ప్రసాద సాధనం, మాధ్యమం పుస్తకమే.

– జంధ్యాల శరత్‌బాబు, రచయిత

ఏకాగ్రత కోసం..



ఏకాగ్రత కోసం పుస్తక పఠనం అవలవాటు చేసుకోవాలి. పుస్తకాలు మన ఆలోచనా దృక్పథాన్ని పెంచుతాయి. నేటి తరం యువత కూడా సాహిత్యం చదవడంపై శ్రద్ధ పెంచాలి.

– ముటుŋŋారు ఉపేంద్రశర్మ, ప్రభుత్వ అధ్యాపకుడు, శ్రీకాకుళం

పుస్తకాలంటే ప్రాణం..



పుస్తకాలంటే నాకు పంచప్రాణాలు. నిత్యం పుస్తకాల మధ్యే ఉంటాను. మార్కెట్లోకి కొత్త పుస్తకం వస్తే ఇప్పటికీ కొనుగోలు చేసే చదువుతాను. పుస్తకాల నిలయాలైన గ్రంథాలయాలను కూడా కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది.

– వాండ్రంగి కొండలరావు, నేషనల్ బుక్ ట్రస్టు క్లబ్ జీవితకాల సభ్యుడు

పుస్తక పఠనంపై ఆసక్తి..



మా టీచర్ వల్ల పుస్తకం చదవడం ఇష్టం పెరిగింది. ఆమె నిత్యం ఏదో ఒక పుస్తకం చదువుతుంటారు. నేను అడిగితే పుస్తకం చదవడంలో ఉన్న ఆనందం చెప్పారు. ఆమె వద్దే పుస్తకాలు తీసుకొని చదివి మళ్లీ తిరిగి ఇచ్చేదాన్ని.

– యడ్ల నిహారిక, ఇంటర్ విద్యార్థిని, కేజీబీవీ

సాహిత్యాభిమానుల కోసం..



సాహిత్యాభిమానుల కోసం మా సంస్థ ఎప్పుడు ప్రాధాన్యమిస్తుంది. బాషాభివృద్ధి కోసం కూడా బస్సుద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు వెళ్లి ప్రదర్శనలు నిర్వహిస్తున్నాం. ఎంతో పురాతమైన సాహిత్య పుస్తకాలను పరిరక్షిస్తున్నాం.

– ఎచ్చెర్ల రవి, మేనేజర్, విశాలాంధ్ర బుక్ హౌస్

విశ్రాంత ఉద్యోగుల ధర్నా



గజపతి కలెక్టరేట్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న జిల్లా రిటైర్డు ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు

పర్లాకిమిడి: ఒడిషా రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు మంగళవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు శాంతియుత ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగులు, పెన్షన్‌దారుల సంఘం అధ్యక్షుడు అశ్వినీ కుమార్ పాఢి, కార్యదర్శి సురేష్ చంద్ర బెహరా, బిచిత్రా నందబెబర్తా, ఈశ్వరమ్మ తదితరులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పాత పెన్షన్ పద్ధతి (ఓ.పి.యస్.), ఎన్.పి.యస్., యు.పి.యస్.అని ప్రభుత్వం విభజించి ఉద్యోగుల మధ్య వ్యత్యాసాలు సృష్టించారని మండిపడ్డారు. దీనికి వ్యతిరేకంగా అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్‌దారుల సమాఖ్య, ఒడిషా రాష్ట్ర రిటైర్డు ఉద్యోగుల సంఘం రాష్ట్రంలో అన్ని జిల్లాలో నిరసన వ్యక్తం చేస్తున్నట్టు చెప్పారు.

అనంతరం కలెక్టర్‌కు గజపతి జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘం తరపున వినతిపత్రాన్ని అందజేశారు.

మహిళల మనస్తత్వాన్ని మార్చలేం

- చెత్తను బయటపడేస్తారు.. కుళాయిలు విరిచేస్తారు..
- జెడ్పీ స్థాయి సంఘ సమావేశంలో ఎమ్మెల్యే కూన వ్యాఖ్యలు



సమావేశంలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ, సీఈఓ శ్రీధర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

శ్రీకాకుళం: జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం స్థాయి సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం విషయమై మాట్లాడుతూ మహిళలు ఇంట్లో చెత్తను తీసుకువచ్చి బయట పడేస్తున్నారని, పరిసరాలు ఎలా ఉన్నా వారికి అనవసరమని చెప్పారు. తాగు నీటి విషయం ప్రస్తావనకు వచ్చినప్పుడు వీధి కుళాయిలు వద్దని, ఇంటింటి కుళాయిలే మంచివని చెబుతూ ఆడవాళ్లు కుళాయిల ట్యాపులు కట్టకుండా వదిలేసి వెళ్లిపోతారని, అవసరమైతే కుళాయిలను విరిచేస్తారని చెప్పారు. ఈ రెండు వ్యాఖ్యానాలు చేసిన అనంతరం మహిళలను కించపర్చటం తన ఉద్దేశం కాదంటూనే వారి మనస్తత్వం ఇలా ఉంటుందని, వారిని మార్చటం సాధ్యం కాదన్నారు.

గ్రంథాలయ వ్యవస్థ వృథా..

పంచాయతీలకు వచ్చే ఆదాయంలో గ్రంథాలయ పన్ను పోతుందని అంటూ గ్రంథాలయ వ్యవస్థే పనికిరానిదని కూన పేర్కొన్నారు. ఆ వ్యవస్థకు ఒక చైర్మన్, జీతం, ఇతర ఖర్చులు కూడా వృథాయేనని చెప్పారు. ఈ వ్యవస్థ వల్ల ఎటువంటి ప్రయోజనం లేదన్నారు.

ప్రగతి పథంలో నడిపించాలి..

జిల్లాలో ఉన్న ప్రభుత్వ శాఖలన్నీ సమన్వయంతో రాజకీయాలకు అతీతంగా పనిచేసి జిల్లాను ప్రగతి పథంలో నడిపించాలని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. జిల్లాలో చేపడుతున్న స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ, పింఛన్లు తదితర ఖర్చుల వివరాలను ఆయా శాఖల అధికారులు వివరించారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ.. పన్నులు వసూళ్లపై దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జెడ్పీ సీఈఓ ఎల్.ఎస్.వి.శ్రీధర్ రాజు సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. సమావేశంలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైస్ చైర్మన్ సిరిపురం జగన్మోహనరావు, జెడ్పీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

భర్తపై వేడి నూనె పోసిన భార్య

- అనంతరం గోడ దూకి పరారీ

పరవాడ: భర్తపై సలసల కాగే నూనెను పోసి పరారైన ఓ భార్య ఉదంతం విశాఖపట్నం జిల్లా పరవాడ పోలీస్ స్టేషన్ పరిధిలోని సాలాపువానిపాలెం గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఎస్ఐ బి.కృష్ణారావు అందించిన వివరాలిలా ఉన్నాయి. గుంటూరు జిల్లాకు చెందిన గండికోట బాలకృష్ణ (30) ఇండియన్ రైల్వేలో లోకో పైలెట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈయన బూర్జ గ్రామానికి చెందిన నక్కా రమణమ్మను ఐదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. నెల రోజుల క్రితం బాలకృష్ణకు అనకాపల్లి రైల్వే స్టేషన్‌కు బదిలీ కాగా.. 20 రోజుల క్రితం కూర్మన్నపాలెం నుంచి సాలాపువానిపాలెం గ్రామానికి మకాం మార్చాడు. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. భార్యాభర్తల మధ్య గత కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. సోమవారం రాత్రి బాలకృష్ణ మద్యం సేవించి వచ్చి భార్యతో గొడవకు దిగాడు. అనంతరం భర్త గదిలో నిద్రపోగా భార్య రమణమ్మ హాల్లో పడుకున్నారు. మంగళవారం తెల్లవారుజాము 3 గంటల సమయంలో ఆమె సలసల కాగే నూనెను భర్త బాలకృష్ణ మోహంపై పోసి గోడ దూకి పరారైంది. విషయం తెలుసుకున్న స్థానికులు తీవ్ర గాయాలతో ఉన్న బాలకృష్ణను చికిత్స నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం బాలకృష్ణ కేజీహెచ్‌లో వైద్యం పొందుతున్నాడు. తనపై అనుమానంతోనే భార్య రమణమ్మ వేడి నూనెతో దాడికి పాల్పడిందని.. 2024లో శ్రీకాకుళం జిల్లా బూర్జ గ్రామంలో తమ మధ్య గొడవ జరగ్గా అప్పుడు యాసిడ్‌తో దాడి చేసి తీవ్రంగా గాయపర్చిందని బాలకృష్ణ పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలంలో పేర్కొన్నాడు. పరారీలో ఉన్న రమణమ్మ కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ కృష్ణారావు చెప్పారు.

ఉత్తరాంధ్ర సాగునీటి కల సాకారమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఇరిగేషన్ మంత్రి రామానాయుడు, వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉత్తరాంధ్ర జిల్లాల సాగునీటి భవితవ్యాన్ని మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలో పాత, కొత్త ప్రాజెక్టులన్నింటినీ సమాన ప్రాధాన్యతతో పూర్తి చేసి, ప్రతి చివరి భూమికి సాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జలవనరుల శాఖ అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ వంశధారపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. నేరడి సైడ్ వియర్ వద్ద పేరుకుపోయిన ఇసుక మేటలను వెంటనే తొలగించి, ఫ్లడ్ ఫ్లో కెనాల్ ద్వారా హిరమండలం రిజర్వాయర్‌కు నిరంతరాయంగా నీరు చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఒడిశాతో ఉన్న సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. పనులు ఆలస్యం చేస్తున్న ఏజెన్సీలకు తక్షణమే నోటీసులు జారీ చేసి, టెండర్ నిబంధనల ప్రకారం పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ పనులకు నిధులు పుష్కలంగా ఉన్నప్పటికీ, పనులు నెమ్మదిగా సాగుతుండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గొట్ట ఎత్తిపోతల పథకం పూర్తయితే 12 టీఎంసీల నీరు హిరమండలం రిజర్వాయర్‌కు తరలించవచ్చని, ఇది కీలకమైన ప్రాజెక్టు అని మంత్రి తెలిపారు. గొట్ట బ్యారేజ్ అప్రాన్ పనుల కోసం రూ.12.81 కోట్ల టెండర్లను వెంటనే పిలవాలని ఆదేశించారు.

షట్టర్ల కుంభకోణంపై చర్చ సందర్భంగా, కోర్టు అనుమతి పొంది వెంటనే షట్టర్లను స్వాధీనం చేసుకోవాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. నాగావళి-వంశధార నదుల అనుసంధాన ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ కోరారు. రణస్థలం పైడి భీమవరం పారిశ్రామికవాడకు సాగునీటి ప్రాజెక్టుల నుంచి నిరంతరాయంగా నీటి సరఫరా ఉండేలా చొరవ చూపాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎస్.ఈశ్వరరావు కోరారు. కళింగపట్నం, అంబల్లవలస ఎత్తిపోతల పథకాల పనులు పూర్తి చేయాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మంత్రిని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం అర్బన్: భారత వాయుసేనలో అగ్నివీర్ వాయు మ్యూజీషియన్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదలైందని జిల్లా ఉపాధికల్పనాధికారి కొత్తలంక సుధ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసై ఉండాలని, మ్యూజిక్ సర్టిఫికెట్‌లో ప్లేయింగ్ ఇన్‌స్ట్రుమెంట్‌లో అనుభవం ఉన్న యువతీ, యువకులు ఈ పోస్టులకు అర్హులని పేర్కొన్నారు. 2005 జనవరి 1 2008 జూలై 1 మధ్య జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు మే 11లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

పుష్పాలంకరణలో పైడితల్లి



విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజామునుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, నేతేటి ప్రశాంత్‌లు శాస్త్రోక్తంగా నిత్య పూజాదికాలు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయం వెనుక ఉన్న వేప,రావిచెట్ల వద్ద దీపారాధన చేశారు. ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ కేఎన్‌వీడీవీ ప్రసాద్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

24 నుంచి వేసవి సెలవులు



రమాజ్యోతి, డీఈఓ

పార్వతీపురంటౌన్: ఈనెల 24 నుంచి పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాఖాధికారి రమాజ్యోతి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏప్రిల్ 24 నుంచి జూన్ 11 వరకు అన్ని యాజమాన్య పాఠశాలలకు సెలవులు ప్రకటించినట్లు పేర్కొన్నారు. వేసవి సెలవుల అనంతరం జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభమవుతాయన్నారు. జూన్ 5వ తేదీన స్కూల్ రెసిడెన్షియల్ కార్యక్రమాల కోసం ఉపాధ్యాయులు పాఠశాలల్లో రిపోర్టు చేయాలని ఆమె స్పష్టం చేశారు.

నాణ్యమైన జీడి పిక్కలు కొనుగోలు చేయాలి

- జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్ శోభిక



చోళ్లపథంలో జీడి పిక్కల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేసీ ఎస్.ఎస్.శోభిక

కొమరాడ: జీడి పరిశ్రమకు అవసరమైన ముడి సరుకు కొనుగోలులో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్ శోభిక సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం కొమరాడ మండలం చోళ్లపథం గ్రామంలోని జీడి పిక్కల కొనుగోలు కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా జీడి పిక్కలను పరిశీలించి రికార్డుల మేరకు సక్రమంగా ఉన్నదీ, లేనిది తనిఖీ చేశారు జిల్లాలో జీడి పరిశ్రమకు ఉజ్వల భవిష్యత్తు ఉందని, నాణ్యమైన జీడిపిక్కలు కొనుగోలు చేసి రికార్డుల్లో సక్రమంగా నమోదు చేయాలని ఆదేశించారు. జీడి బస్తాలను గిడ్డంగిలో జాగ్రత పరచాలని, పరిశ్రమకు తరలించే వరకు పూర్తి బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే వీడీవీకే సభ్యులు, జీడి రైతులతో సంభాషించి సంబంధిత అధికారులు పలు మార్గదర్శకాలను జారీచేశారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం సురేష్, ఏఓ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

- ఇద్దరికి తీవ్ర గాయాలు



సంఘటన స్థలంలో దినేష్ మృతదేహం




తీవ్రంగా గాయపడ్డ సింహాద్రి, కార్తీక్

గంట్యాడ: మండలంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. విశాఖపట్నంలోని రుషికొండ ప్రాంతానికి చెందిన గద్దెపల్లి దినేష్, గద్దెపల్లి సింహాద్రి, మంగమ్మపేటకు చెందిన గరికిన కార్తీక్‌లు అరకు వెళ్లి మంగళవారం తెల్లవారుజామున 3:30 గంటల ప్రాంతంలో తిరుగు ప్రయాణంలో ద్విచక్ర వాహనంపై విశాఖ వెళ్లిపోతుండగా కొండ తామరపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ దాటిన తర్వాత జాతీయ రహదారిపై కానాను బలంగా ఢీకొట్టడంతో బైక్‌పై నుంచి ముగ్గురూ ఎగిరి పడ్డారు. ఈ ప్రమాదంలో దినేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. సింహాద్రి, కార్తీక్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు 108 అంబులెన్సులో గాయపడిన వారిని చికిత్స కోసం, దినేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు.

సాగుకు కూలీల కొరత

- వ్యవసాయానికి అనుసంధానంకాని ఉపాధిహామీ
- అవస్థలు పడుతున్న రైతులు
- అనుసంధానంపై ఆశగా ఎదురుచూపులు



దుక్కులుచేస్తున్న రైతు



ఉపాధిపనులను చేస్తున్న చేస్తున్న వేతనదారులు(ఫైల్)

పార్వతీపురం: వ్యవసాయ రంగాన్ని రోజురోజుకూ కూలీల కొరత వేధిస్తోంది. సేద్యంలో పెట్టుబడుల భారం పెరిగిపోవడంతో పాటు కూలీలు దొరక్క అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలన్న డిమాండ్ ఎన్నో ఏళ్లుగా ఉన్నా, ఆ దిశగా ప్రభుత్వాలు చర్యలు చేపట్టకపోవడంతో రైతులకు తిప్పలు తప్పడం లేదు.

అప్పులతో తిప్పలు

పార్వతీపురం మన్యం జిల్లాలోని 15 మండలాల్లో ప్రధాన పంటగా వరిని ఏటా 1.75 లక్షల ఎకరాల్లో సాగు చేస్తారు. అలాగే రబీలో వేరుశనగ, రాగి, పత్తి, వరి, మొక్కొజొన్న, టమాటో తదితర పంటలను సుమారు 80వేల ఎకరాల్లో సాగు చేస్తుంటారు. జిల్లాలో 1.89 లక్షల జాబ్‌కార్డులుండగా ప్రస్తుతం 1.60 లక్షల మంది వేతనదారులు ఉపాధిపనుల్లో పాల్గొంటున్నారు. ఉన్న పొలాన్ని బీడు భూమిగా ఉంచకూడదన్న ఉద్దేశంతో గిట్టుబాటు కానప్పటికీ అప్పులు చేసి మరీ పంటలు సాగుచేస్తున్నారు. వచ్చిన ఆదాయంతో కుటుంబపోషణ సాగిస్తూ చేసిన అప్పులకు వడ్డీలు చెల్లిస్తున్నారు. పంటలో నష్టాలు వచ్చినపుడు చేసిన అప్పుకు వడ్డీలు కూడా చెల్లించలేకపోతున్నారు. ఎకరా వరి సాగుచేసేందుకు రూ.20వేల వరకు ఖర్చుచేయాల్సి ఉంటుంది. అదే వ్యవసాయానికి ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేస్తే కూలీల ఖర్చుతో పాటు రైతులకు కొంతవరకు పెట్టుబడి తగ్గే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా కూలీలు సమయానికి దొరకకపోవడంతో రైతన్నల తిప్పలు వర్ణనాతీతంగా ఉన్నాయి. కేంద్రంపై ఒత్తిడి పెంచి ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వం స్పందించాలి



అప్పులు చేస్తే తప్ప వ్యవసాయం చేయలేని పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం రైతుల కష్టాలను గుర్తించి కేంద్రం దృష్టికి తీసుకువెళ్లి ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలి. దీనివల్ల రైతులతోపాటు వేతనదారులకు కూడా మేలు జరుగుతుంది.

– తెర్లి ఎల్లంనాయుడు, ఉప సర్పంచ్, పెద్దూరు

భారంగా వ్యవసాయం



రైతులకు పంటల సాగు భారంగా మారుతోంది. అప్పులు చేసి వ్యవసాయంపై పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగి రాకపోవడంతో అప్పుల భారం పెరుగుతోంది. ప్రభుత్వం రైతుల ఆర్థిక ఇబ్బందులను గుర్తించి ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలి. అప్పుడే రైతులకు కొంతమేర భారం తగ్గుతుంది.

– బొత్స తాతబాబు, రైతు, నాగూరు

వ్యవసాయానికి అనుసంధానం చేయాలి

ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని రైతులు కొన్నేళ్లుగా డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వాలు ప్రకటనలు చేస్తున్నాయే తప్ప ఆచరణకు నోచుకోవడం లేదు. వేతనదారులు ఉపాధి పనులకు వెళ్తుండడంతో వ్యవసాయ పనులకు కూలీల కొరత ఏర్పడుతోంది. 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ఉపాధిహామీ పథకాన్ని అనుసంధానం చేస్తామని హామీ ఇచ్చి విస్మరించింది. ప్రస్తుతం టీడీపీ, జనసేన, బీజేపీలు కలిసి అధికారంలో ఉన్నప్పటికీ ఆ దిశగా ఆలోచన చేయడం లేదు. గతంలో టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలని రైతులతో పాటు రైతు సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు. వ్యవసాయరంగంలో రైతులు తమ స్థోమతకు మించి అధిక వడ్డీలకు అప్పులుచేసి పెట్టుబడులు పెడుతున్నా ఫలితం లేకుండా పోతోంది. అంతంతమాత్రంగానే దిగుబడులు రావడం, ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంటలు నాశనం కావడంతో రైతులు కుదేలవుతున్నారు. దీంతో అప్పులు తీర్చలేక అనేక మంది వ్యవసాయం విడిచి వలస పోతున్నారు. ఈ నేపథ్యంలో రైతులను ఆదుకునేందుకు ఉపాధిహామీ పథకాన్ని అనుసంధానం చేస్తామని గతంలో ఇచ్చిన హామీని అమలు చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు. ప్రభుత్వం వ్యవసాయానికి ఉపాధిహామీ పథకాన్ని అనుసంధానం చేస్తే చాలామంది రైతులకు లాభం చేకూరుతుందని ఆశగా ఉన్నారు. ఏళ్లు గడుస్తున్నా ఇచ్చిన హామీని ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై రైతన్నలు సర్వత్రా మండిపడుతున్నారు.

ఇళ్ల స్థలాల పంపిణీలో జాప్యం

- కార్పొరేట్‌లకు లక్షల ఎకరాలు ధారబోత
- ఇంటిస్థలం ఇచ్చేవరకు పోరాటం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఈశ్వరయ్య



సీపీఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిరసన చేస్తున్న దృశ్యం



సీపీఐ ఆధ్వర్యంలో డీఆర్‌ఓకు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

విజయనగరం గంటస్తంభం: కార్పొరేట్లకు లక్షల ఎకరాలు ధారాదత్తం చేస్తున్న కూటమి పాలకులు పేదోడికి 2 సెంట్లు ఇంటి స్థలం అడిగితే లేదని చెప్పడం చంద్రబాబు మోసకారితనానికి నిదర్శనం. కూటమి ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు గడిచినా ఇప్పటివరకూ పేదలకు ఇళ్ల నిర్మాణం, స్థలాల మంజూరుకు సంబంధించి ఒక్క అడుగూ ముందుకు పడలేదు. దీంతో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సొంతింటి కల నెరవేర్చుకోవాలన్న ఆశ సామాన్య కుటుంబాలకు అందని ద్రాక్షగా మిగిలిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య ఆరోపించారు. పట్టణ ప్రాంతాల్లో 2సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు ఇంటి స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలి. ప్రస్తుతం ప్రభుత్వ స్థలంలో ఇల్లు కట్టుకుని నివాసం ఉంటున్న వారికి ఉన్న చోటే పట్టాలు మంజూరు చేయాలి. అర్హులైన వారికి రేషన్ కార్డులు, పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్‌చేస్తూ మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ముందు ధర్నా చేపట్టారు. అనంతరం డీఆర్‌ఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ.

సర్వేల పేరిట కాలక్షేపం

సొంత స్థలం ఉండి ఇల్లు కట్టుకునే కుటుంబాలకు ప్రభుత్వం సాయం అందిస్తే ఎన్నో కుటుంబాలకు మేలు జరుగుతుందన్నారు. సర్వేల పేరుతో ప్రభుత్వం కాలక్షేపం చేస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ సాయం పెంచడంతో ఇల్లు కట్టుకునేందుకు సొంత స్థలం ఉన్నవారు చాలామంది ముందుకొస్తున్నారన్నారు. గ్రామాల్లో ఇంకా గృహ నిర్మాణాలకు సంబంధించిన ప్రక్రియ మొదలు కాలేదని అధికారులు చెబుతున్నారు. 2014–19 టీడీపీ పాలనలోనే ఇదే పరిస్థితి నెలకొంది. తొలుత మూడేళ్ల పాటు ఇళ్ల నిర్మాణాలకు అవకాశం ఇవ్వకుండా తర్వాత ఇచ్చారు. ఇళ్ల నిర్మాణం పూర్తయ్యే సరికి 2019 ఎన్నికలు దగ్గరపడ్డాయి. టీడీపీ ఓటమి పాలైంది. ఎన్నికల హామీలలో భాగంగా కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికీ అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులు గడుస్తున్నా పట్టించుకోకపోవడం విడ్డూరమన్నారు.పేదలకు రెండు సెంట్లు, మూడు సెంట్లు, ఇంటి నిర్మాణానికి ఐదు లక్షలు అని చెప్పి ఇంతవరకు దాని గురించి పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు పూర్తిగా అప్పగించకుండా నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీలు అమలు చేయడంలో ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోందని విమర్శించారు. ఇళ్ళ స్థలాలు, ఇంటి పట్టాలు పేదలు నివసించే ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్, ఆనందరావు, ఎస్.రంగరాజు, కోట అప్పన్న, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో ఐదవ నిందితుడి అరెస్టు



విలేకరుల సమావేశంలో గంజాయి నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న సీఐ కె.నారాయణరావు పక్కన ఎస్సై ప్రసాదరావు

రామభద్రపురం: మండలంలోని కొట్టక్కి పోలీస్ చెక్ పోస్టు వద్ద ఫిబ్రవరి 10వ తేదీన ఒడిశా నుంచి అక్రమ రవాణా జరుగుతున్న 147 కిలోల గంజాయి పోలీసులకు పట్టుబడగా కారు వదిలేసి అందులో ఉన్న నిందితులు పరారైన వారిలో నలుగురిని గత నెల 31న పోలీసులు పట్టుకున్న సంగతి తెలిసిందే. అయితే అప్పట్లో సీఐ నారాయణరావు, ఎస్ వి ప్రసాదరావులు కేసు నమోదు చేసి ముమ్మర దర్యాప్తుచేయడంతో మండలకేంద్రంలోని బైపాస్ రోడ్డులో మంగళవారం ఐదవ నిందితుడిని పట్టుకుని అరెస్టు చేశారు. ఈ మేరకు విలేకరుల సమావేశంలో సీఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అరకు మండలం తురాయిగూడ గ్రామానికి చెందిన కొర్రా కోగేశ్వరరావు ఇంటర్మీడియట్ పాసై అరుకులో శ్యామ్‌గణేష్ పంగి అనే మెడికల్ షాపులో యజమాని వద్ద కారు డ్రైవర్‌గా పనిచేసేవాడు. పంగి మెడికల్ షాపు నిర్వహిస్తూ కొర్రా కోగేశ్వరరావు ద్వారా ఒడిశా నుంచి కొద్దికొద్దిగా గంజాయి అక్రమ రవాణా చేస్తూ పెందుర్తిలో ఉంటున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన వ్యక్తులకు సరఫరాచేసేవాడు. 2024 ఫిబ్రవరిలో కారులో 150 కిలల గంజాయి అక్రమరవాణా చేస్తూ శ్యామ్‌గణేష్ పంగితో పాటు కారు డ్రైవర్ కొర్రా కోగేశ్వరరావులు పోలీసులకు పట్టుబడ్డారు.అప్పట్లో వారిపై కేసునమోదు చేసి వైజాగ్ సెంట్రజైల్‌కు తరలించారు.జైలులో ఉన్న సమయంలో కోగేశ్వరరావుకు మరో గంజాయి స్మగ్లర్ శెట్టి ఉమామహేశ్వరరావు పరిచయమయ్యాడు.వారిద్దరు బెయిల్‌పై బయటకు వచ్చిన తర్వాత మళ్లీ గంజాయి అక్రమరవాణా ప్రారంభించారు. ఈ క్రమంలో పెదబయలు నుంచి ఈఏడాది ఫిబ్రవరి 10వ తేదీన కారులో గంజాయి తరలిస్తూ కొట్టక్కి వద్ద పోలీసులకు పట్టుపడడంతో కారు వదిలేసి పరారయ్యారు. మార్చి 31న నలుగురు నిందితులను అరెస్టు చేశారు. అప్పటి నుంచి పోలీసులు గాలించగా మంగళవారం కారు డ్రైవర్ కోగేశ్వరరావు పట్టుబడ్డాడు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. మిగిలిన మరి కొంతమంది నిదింతుల కోసం గాలిస్తున్నారు.

దళితుల సామాజిక బహిష్కరణ దారుణం



మాట్లాడుతున్న జైభీమ్‌రావు భారత్ పార్టీ ప్రతినిధులు

నెల్లిమర్ల రూరల్: సాక్షాత్తు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో దళితులను సామాజిక బహిష్కరణ చేయడం దారుణమని జై భీమ్‌రావు భారత్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టొంపల నరసయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి కనిగిరి శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు మండలంలోని సతివాడ గ్రామంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. కాకినాడ జిల్లా మల్లాం గ్రామంలో దళితులను సామాజిక బహిష్కరణ చేయడం సభ్య సమాజం తలదించుకునేలా ఉందన్నారు. పవన్ కల్యాణ్ నియోజకవర్గంలో ఘటన జరగడం అగ్రకులాల దురహంకారానికి నిదర్శనమన్నారు. దళితులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తున్నారని, దళిత వ్యక్తిని చంపినప్పటికీ ప్రభుత్వం, అధికారులు స్పందించడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం కళ్లు తెరిచి గ్రామస్తులపై అట్రాసిటి కేసులు నమోదు చేసి, దళితులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

విజ్ఞాన క్షేత్ర పరిశీలనకు ఒడిశా పయనం

విజయనగరం అర్బన్: వైజ్ఞానిక అంశాలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు సైన్స్ ఎక్స్‌పోజర్ విజిట్ కింద జిల్లాలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులు 160 మంది ఒడిశా రాష్ట్రంలోని రాయగడకు మంగళవారం పయనమయ్యారు. విద్యార్థులు వెళ్లే బస్సుకు కలెక్టరేట్ ప్రాంగణంలోని డీఈఓ కార్యాలయం ఎదుట డీఈఓ యు.మాణిక్యంనాయుడు, సర్వశిక్ష ఏపీసీ డాక్టర్ ఎ.రామారావు జెండా ఊపి ప్రారంభించారు. రాయగడలోని మజ్జి గౌరీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాలలో బయోటెక్నాలజీ, మెకానికల్, ఎలక్ట్రికల్ విభాగాలు, మష్రూమ్ యూనిట్‌ను సందర్శించి విజ్ఞాన విషయాలను తెలుసుకుంటారని సమగ్రశిక్ష ఏఎంఓ ప్రసాద్ తెలిపారు. నాగావళి ప్లానిటోరియంలో 3డీ షోను వీక్షిస్తారని, జేకే పేపర్ మిల్స్‌ను సందర్శిస్తారని చెప్పారు.

వాడపల్లి తిరుపతికి ఆర్టీసీ సర్వీసులు

విజయనగరం అర్బన్: కోనసీమ తిరుపతిగా ఖ్యాతి పొందిన వాడపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయ దర్శనానికి ఆర్టీసీ సర్వీసులను ప్రతి శుక్రవారం నడుపుతామని విజయనగరం డిపో మేనేజర్ జె.శ్రీనివాసరావు తెలిపారు. ప్రతి శుక్రవారం రాత్రి 8 గంటలకు విజయనగరం నుంచి బయలుదేరిన బస్సు శనివారం తెల్లవారు జామున 4 గంటలకు వాడపల్లి చేరుకుంటుందని, తిరిగి మరలా ఉదయం 9 గంటలకు వాడపల్లి నుంచి బయలుదేరి సాయంత్రం 4 గంటలకు విజయనగరం చేరుకుంటుందని తెలిపారు. కొత్త సూపర్ లగ్జరీ బస్సుని వేశామని, టికెట్ ధర కేవలం రూ.1200 మాత్రమేనని తెలిపారు. టికెట్లను ఆర్టీసీ డిపోలో లేదంటే 'ఏపీఎస్ఆర్‌టీసీఆన్‌లైన్.ఐఎన్'లో బుక్ చేసుకోవచ్చన్నారు. పూర్తి వివరాల కోసం సెల్: 99592 25620, 94943 31213 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

మంత్రి ఇలాకాలో మట్టిమాఫియా

- స్థానిక టీడీపీనేత అండతో దందా
- యథేచ్ఛగా తరలింపు
- చోద్యం చూస్తున్న అధికారులు



గ్రామంలోని కోనేటి నుంచి మట్టిని ట్రాక్టర్‌కు ఎత్తి తరలిస్తున్న దృశ్యం

గజపతినగరం రూరల్: నియోజకవర్గంలోని మరుపల్లి గ్రామం మధ్యలో ఉన్న కోనేటిలోనుంచి గడిచిన కొన్ని రోజులుగా మట్టిమాఫియా రెచ్చిపోతోంది. సహజ వనరులను దోచేస్తు అడ్డదిడ్డంగా టీడీపీ తమ్ముళ్లు సంపాదించుకుంటున్నారు. గ్రామం మధ్యలో ఉన్న కోనేటిలోని మట్టిని యథేచ్ఛగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

మట్టిమాఫియాకు కేరాఫ్ మరుపల్లి

నియోజకవర్గంలోని మరుపల్లి గ్రామంలో గతంలో ఆదర్శపాఠశాలను ఆనుకుని ఉన్న కొండనుంచి మట్టిని అక్రమంగా తరలించి గ్రామానికి చెందిన కొంతమంది నాయకులు సొమ్ముచేసుకున్నారు. పగటిపూట అయితే ఎవరి కంటైనా పడతామని రాత్రి సమయంలో జేసీబీలతో అక్రమంగా మట్టిని తరలించేవారు. ప్రస్తుతం కొండప్రాంతంలో మట్టి తరలింపునకు ఫుల్‌స్టాప్ పెట్టడంతో నేరుగా గ్రామంలో ఉన్న కోనేటి చెరువుపై పడ్డారు.

అనుమతులు ఏవీ?

గ్రామంలో ప్రభుత్వానికి సంబంధించిన ఏ ప్రాంతం నుంచైనా మట్టిని తీయాలంటే స్థానిక పంచాయతీ అనుమతులు, తీర్మానం ఉండాలి. అలాగే రెవెన్యూ శాఖకు చెందిన సిబ్బంది కూడా అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ ఎటువంటి అనుమతులు లేకుండానే నేరుగా మట్టిని తరలించేస్తున్నారు. గడిచిన నాలుగు రోజులుగా ఇదే పరిస్థితి నెలకొంది.

పంచాయతీ అనుమతులు ఇవ్వాలి

గ్రామంలోని చెరువుల్లోంచి మట్టిని తీసుకోవాలంటే స్థానిక పంచాయతీ అనుమతులు తీసుకోవాలి. రెవెన్యూ నుంచి మట్టి తరలించేందుకు ఎవరికీ ఎటువంటి అనుమతులు ఇవ్వలేదు.

– రత్నకుమార్ తహసీల్దార్

సర్పంచ్ భర్త తోలుకోమన్నారు

కోనేరులోని దెప్పులుగా ఉన్న మట్టిని స్థానిక సర్పంచ్ భర్త సత్యనారాయణ తీసుకెళ్లమన్నారు. ఆయన చెప్పారని మట్టిని ట్రాక్టర్‌తో తీసుకెళ్తున్నాం.

– గౌరినాయుడు, మట్టి తరలింపుదారు

కోనేరు లోతు అవుతుందని

గ్రామంలో ఉన్న కోనేరులో మట్టి తరలిస్తే లోతు ఎక్కువవుతుందని చెప్పాం. మట్టి తరలింపునకు ఎటువంటి తీర్మానం చేయలేదు.డబ్బులు ఎవరి దగ్గరా తీసుకోలేదు.

– లెంక సత్యనారాయణ, టీడీపీ నాయకుడు మరుపల్లి

బంగారు కొండలు

- దివ్యాంగుల స్పెషల్ ఒలింపిక్స్‌లో గోల్డ్‌మెడల్స్
- నూజివీడులో జరిగిన పోటీలు



రాష్ట్ర స్పెషల్ ఒలింపిక్ భారత్-2025 పోటీల్లో క్రిపుల్డ్ వాక్ పోటీలో గోల్డ్‌మెడల్ సాధించిన తెర్లాం హైస్కూల్ విద్యార్థి యశ్వంత్(మధ్యలో ఉన్న విద్యార్థి)



బంగారు పతకం సాధించిన అజయ్

తెర్లాం: రాష్ట్రస్థాయిలో జరుగుతున్న దివ్యాంగుల స్పెషల్ ఒలింపిక్స్ భారత్–2025 పోటీల్లో తెర్లాం హైస్కూల్‌కు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థి యశ్వంత్, బాడంగి పీఎంశ్రీ స్కూల్‌లో చదువుతున్న అజయ్ రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచి బంగారు పతకాలను కైవసం చేసుకున్నారు. రాష్ట్రస్పెషల్ ఒలింపిక్స్ భారత్ కమిటీ ఆధ్వర్యంలో నూజివీడులోని అగిరిపల్లిలో గల హిల్ పారడైజ్ స్కూల్ ఆవరణలో ఈ నెల 21, 22 తేదీల్లో వివిధ రకాల వైకల్యంతో బాధపడుతున్న దివ్యాంగ పిల్లలకు రాష్ట్రస్థాయి ఆటల పోటీలు నిర్వహించారు. అందులో భాగంగా తెర్లాం హైస్కూల్‌కు చెందిన యశ్వంత్ 50 మీటర్ల క్రిపుల్డ్ వాక్ పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించాడు. తెర్లాం హైస్కూల్‌లో పనిచేస్తున్న స్పెషల్ టీచర్ సునీల్ ఎస్కార్టుగా యశ్వంత్‌కు వ్యవహరించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో అత్యుత్త ప్రతిభ కనబరిచిన యశ్వంత్‌ను జిల్లా విద్యా, సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ ఉన్నతాధికారులు, మండల విద్యాశాఖాధికారి జె.త్రినాధరావు, తెర్లాం హైస్కూల్ హెచ్‌ఎం రమేష్, ఉపాధ్యాయులు అభినందించారు. మరిన్ని పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు. అలాగే బాడంగిలోని పీఎంశ్రీ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి రాజాన అజయ్ హయ్యర్‌ఎబిలిటీ100మీటర్ల పరుగులో బంగారుపతకాన్ని సాధించినట్లు ప్రత్యేక ఉపాధ్యాయుడు ఈశ్వరరావు తెలిపారు. సమగ్రశిక్ష, రాష్ట్రస్పెషల్ ఒలింపిక్స్ భారత్ కమిటీ సంయుక్తంగా హిల్ పారడైజ్ స్కూల్ అగిరిపల్లిలో నిర్వహించిన క్రీడా పోటీల్లో ప్రతిభచూపించి జాతీయస్పెషల్ ఒలింపిక్స్‌పోటీలకు అర్హతసాధించినట్టు తెలిపారు. బంగారు పతకం సాధించిన అజయ్‌ను సమగ్రశిక్ష ఏపీసీ ఎ.రామారావు, డీఈఓ.మాణిక్యంనాయుడు, సహిత విద్యాజిల్లా కోఆర్డినేటర్ ఎస్.సూర్యారావు, సహాయ ఐఈ భారతి, హెచ్‌ఎం.సత్యనారాయణ, కొల్లిఈశ్వరరావు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

మే నెలాఖరులోగా సారా రహిత జిల్లా

- ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నెంబర్ 14405
- జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్




మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్

విజయనగరం అర్బన్: మే నెలాఖరు నాటికి సారా రహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేయాలని అధికారులను జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్ కోరారు. సారాకు సంబంధించిన ఫిర్యాదుల స్వీకరణ కోసం ఏర్పాటు చేసి టోల్‌ఫ్రీ నంబర్‌కు 14405కు విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. ఏపీ ప్రభుత్వ ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నవోదయం 2.0 కార్యక్రమం అమలుపై వివిధ శాఖల అధికారులతో సారా నిర్మూలన సమన్వయ సమావేశాన్ని మంగళవారం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడైనా సారా తయారీ కానీ, వినియోగం కానీ జరగడం లేదని అన్ని పంచాయతీల నుంచి తీర్మానాలు తీసుకునే ప్రక్రియను మే 15లోగా పూర్తి చేయాలని కోరారు. అలాగే మండలాల నుంచి తీర్మానాలను కూడా త్వరగా పూర్తి చేయాలన్నారు. ముఖ్యంగా అన్ని గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలో నవోదయం 2.0 కార్యక్రమం అమలు, తీసుకున్న చర్యలను ఎక్సైజ్ సూపరింటెండెంట్ జి.శ్రీనాథుడు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో డీఆర్‌ఓ శ్రీనివాసమూర్తి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.జీవనరాణి, డీఆర్‌డీఏ పీడీ కల్యాణ్‌చక్రవర్తి, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రాజ్యలక్ష్మి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.అప్పలనాయుడు, జిల్లా గిరిజన సంక్షేమాధికారి శ్రీనివాసరావు, డీఎస్పీ వీరకుమార్, అబ్కారీ, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

గంజాయి నిందితుల ఆస్తులు జప్తు చేయాలి

- ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి



సమావేశంలో పాల్గొన్న విజయనగరం, పార్వతీపురం ఎస్పీలు వకుల్ జిందల్ మాధవ్ రెడ్డి

పార్వతీపురం రూరల్: గంజాయి అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడే నిందితుల ఆస్తులను జప్తు చేయాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి ఆదేశించినట్లు పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్‌వీ మాధవ్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం విశాఖలో పలు జిల్లాల ఎస్పీలతో నిర్వహించిన సమావేశంలో డీఐజీ వెల్లడించినట్లు ఎస్పీ మాధవ్ రెడ్డి తెలిపారు. అలాగే గంజాయి కేసుల్లో ఉన్న నిందితులను వెంటనే గుర్తించి అరెస్టు చేయాలని, ప్రజల సహకారంతో సమగ్ర సమాచారం సేకరించాల్సిన అవసరాన్ని డీఐజీ తెలియజేసినట్లు చెప్పారు. గంజాయి రవాణా నియంత్రణకు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి విస్తృత తనిఖీలు ప్రారంభించాలని ఆదేశించారని, తప్పించుకుని తిరుగుతున్న నిందితులను అరెస్టుచేసి వారిపై నాన్‌బెయిల్‌బుల్ వారెంట్లు తక్షణమే అమలు చేయాలని ఆదేశించారన్నారు.

సాంకేతిక పరిజ్ఞానం జోడించాలి

నేరాల నిరోధంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి ప్రాధాన్యం ఇచ్చి సీసీటీవీలు, డ్రోన్ల సహాయంతో నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేసి దర్యాప్తు నిర్వహించాలని, సైబర్ క్రైం, అలాగే సోషల్ మీడియాలో వివాదాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలు నిర్వహించాలని సైబర్ మోసాల పట్ల ఏ విధమైన జాగ్రత్తలు తీసుకోవాలో ప్రజలకు వివరించాలని, టోల్‌ఫ్రీ నంబర్ 1930 వినియోగం ప్రజలకు తెలియజేయాలని డీఐజీ ఆదేశించినట్లు ఎస్పీ తెలిపారు.

సీసీ కెమెరాలు, డ్రోన్లతో గంజాయికి అడ్డుకట్ట

విజయనగరం క్రైమ్: గంజాయి అక్రమ రవాణాపై రాష్ట్ర పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి పెట్టింది. మంత్రి అనిత ఆదేశాలతో విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి తన కార్యాలయంలో ఐదు జిల్లాల ఎస్పీలతో మంళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఐజీ గోపీనాథ్ జెట్టి గంజాయి అక్రమరవాణా, వినియోగ నియంత్రణ, నిందితుల అరెస్ట్, వారి ఆస్తుల జప్తుపై స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని విజయనగరం ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.

రెండు కేజీల గంజాయి స్వాధీనం



నిందితుడిని అరెస్ట్ చేసిన జీఆర్‌పీ ఎస్సై బాలాజీ, సిబ్బంది

విజయనగరం క్రైమ్: స్థానిక రైల్వేస్టేషన్‌లో జీఆర్పీ సిబ్బంది రెండు కేజీల గంజాయిని మంగళవారం పట్టుకున్నారు. జీఆర్పీ ఎస్పీ ఆదేశాల మేరకు విజయనగరం జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ రవి కుమార్ సూచనలతో ఎస్సై బాలాజీ, హెచ్‌సీ కృష్ణారావులు విజయనగరం రైల్వేస్టేషన్‌లో తనిఖీ చేసి ఒడిశాకు చెందిన వ్యక్తి రాయగడ ట్రైన్‌లో విశాఖకు గంజాయి తరలిస్తుండగా పట్టుకున్నారు. అనంతరం నిందితుడిని అదుపులోకి తీసుకుని రెండు కేజీల గంజాయి, రూ.పదివేల నగదు స్వాధీనం చేసుకున్నామని జీఆర్‌పీ ఎస్సై బాలాజీ చెప్పారు.